నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | బుధవారం 13 నవంబర్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD



గుట్టపై సత్యనారాయణ స్వామి ఆలయం

గూడెం గుట్టకు కార్తీక శోభ

నేటి నుంచి 15వ తేదీ వరకు ప్రత్యేక పూజలు

దండేపల్లి, నవంబర్12 : దండేపల్లి మండలంలోని గూడెం గుట్ట కార్తీక శోభను సంతరించుకున్నది. ఇక్కడి సత్యనారాయణ స్వామి, అయ్యప్పస్వామి, షిర్డీసాయిబాబా, ఆంజనేయస్వామి దేవస్థానం, శనేశ్వరాలయం, సదానందస్వామి ఆలయాలకు ఎంతో విశిష్టత ఉంది. యేటా కార్తీక మాసం పౌర్ణమి రోజున వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకొని, సామూహిక వ్రతాలు ఆచరిస్తారు. గోదావరిలో పుణ్యస్నానాలు చేసి మొక్కులు తీర్చుకుంటారు. ఉమ్మడి ఆదిలాబాద్ నుంచేగాక ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాలతో పాటు పక్క రాష్ట్రాల నుంచి భక్తులు వేలాదిగా తరలివస్తారు. అలాగే మాఘమాసంలో ఏడురోజుల పాటు బ్రహ్మోత్సవాల్లో భాగంగా కల్యాణం నిర్వహిస్తారు.

నేటి నుంచి ప్రత్యేక కార్యక్రమాలు

సత్యనారాయణ స్వామి ఆలయంలో నేటి నుంచి 15వ తేదీ వరకు కార్తీక పౌర్ణమి పూజలు నిర్వహించనున్నారు. 13న విశ్వక్సేన ఆరాధన, పుణ్యహవాచనము, అంకురారోపణము, అగ్ని ప్రతిష్ఠ, నిత్యహవణము, బలిహరణం, తీర్థప్రసాద వితరణ, గోధూళిక సుముహూర్తాన తులసీ కల్యాణం 14న నిత్యహవణము, బలిహరణము, తీర్థప్రసాద వితరణ, 15న నిత్యహవణము, బలిహరణము, తీర్థప్రసాద వితరణ, కార్తీక పౌర్ణమి జాతర,సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు, మహా పూర్ణాహుతి, హోమంపంటి కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

తెగిపడిన కరెంటు తీగ

తప్పిన పెను ప్రమాదం

మంచిర్యాలటౌన్, నవంబర్ 12 : పట్టణంలోని మార్కెట్ ఏరియాలోని గంగారెడ్డి రోడ్‌లో ముఖరాం చౌరస్తాకు వెళ్లే మార్గంలో విద్యుత్ వైరు తెగి పడిపోయింది. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతం కావడంతో దుకాణాల యజమానులు అప్రమత్తమై కరెంటు తీగ వైపు ఎవ్వరినీ వెళ్లకుండా అడ్డుకున్నారు. అనంతరం అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు సరైన సమయంలో స్పందించి తగు చర్యలు తీసుకోవడంతో పెను ప్రమాదం తప్పినట్లయ్యింది.

పట్టణంలోని గంగారెడ్డి రోడ్‌లో తెగిపడిన కరెంటుతీగ

ఆడెల్లి తండా శివారులో అక్టోబర్ 26న పులి దాడిలో గాయపడ్డ ఆవు



నేరడిగొండ మండలం నిర్మల్ ఘాట్ సెక్షన్‌పై దర్జాగా రోడ్డు దాటుతున్న పులి

పెద్దపులి అలజడి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల్లో నిత్యం ఎక్కడోచోట కదలికలు

- నిర్మల్ జిల్లా పశ్చిమ కనుమల్లో మకాం వేసిన టైగర్
- మంచిర్యాల అడవుల్లో తచ్చాడుతున్న మరొకటి
- అటవీ సమీపంలోని పల్లెల్లో పశువులపై దాడులు
- భయపడిపోతున్న రైతులు, ప్రజలు
- సంరక్షణ చర్యల్లో అటవీ అధికారులు

మంచిర్యాల, నవంబర్ 12 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పెద్దపులుల సంచారం అలజడి సృష్టిస్తున్నది. కొన్ని రోజులుగా మంచిర్యాల, నిర్మల్ జిల్లాల్లోని అటవీప్రాంత పల్లెల్లో నిత్యం ఎక్కడో చోట పశువులపై దాడులు చేస్తుండగా, ప్రజానీకం భయాందోళనలకు గురవుతున్నది. ఇక రాత్రి.. తెల్లవారుజామున వ్యవసాయ పనుల కోసం వెళ్లే రైతులైతే ఎప్పుడు ఏ వైపు నుంచి వచ్చి పులి దాడి చేస్తుందోనని గజగజ వణికిపోతున్నారు. మహారాష్ట్ర నుంచి వచ్చే పులులు కొంతకాలం ఇక్కడే ఉండే అవకాశాలున్న నేపథ్యంలో అటవీ అధికారులు అప్రమత్తమవ్వడమే గాక.. వాటి సంరక్షణపై దృష్టి పెట్టారు. వాటిని నిత్యం ట్రాక్ చేస్తున్నారు. అటవీ సమీప గ్రామాల ప్రజలకు అవగాహన కల్పిస్తూ అలర్ట్ చేస్తున్నారు.

పక్షం రోజులుగా నిర్మల్‌లో ఒకటి.. రెండు నెలలుగా కవ్వాల్‌లో మరొకటి..

మహారాష్ట్ర అటవీ ప్రాంతం నుంచి నిర్మల్ జిల్లా సహ్యాద్రి పర్వత శ్రేణుల్లోకి ప్రవేశించిన పెద్దపులి గత పక్షం రోజులుగా ఇక్కడే మకాం వేసింది. కుభీర్ మండలం నుంచి కడెం వరకు సుమారు 200 కిలోమీటర్ల పొడవున ఉన్న సహ్యాద్రి పర్వత శ్రేణుల్లోని అడవుల్లో స్వేచ్ఛగా తిరుగుతుందని అధికారులు చెబుతున్నారు. ఆదిలాబాద్ జిల్లా తాంసి, తలమడుగు అడవుల నుంచి ఈ పులి నిర్మల్ జిల్లాలోని అడవుల్లో ప్రవేశించి ఉండొచ్చని భావిస్తున్నారు. తెలంగాణ కశ్మీర్‌గా పేరొందిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అటవీ ప్రాంతం పెద్దపెద్ద చెరువులు, కుంటలు, జలాశయాలకు ప్రసిద్ధి. వన్యప్రాణుల నివాసానికి మన జిల్లా అడవులు ఎంతో అనువైనవి కావడంతో.. పెద్దపులి సైతం ఇక్కడి సహ్యాద్రి పర్వతాల్లో మకాం వేసినట్లు అధికారులు భావిస్తున్నారు. జిల్లాలోని సారంగాపూర్, కుంటాల, కుభీర్, నర్సాపూర్(జీ), దిలావర్‌పూర్, పెంబీ తదితర మండలాల్లోని అటవీ సరిహద్దు ప్రాంతాల్లో పెద్దపులి తిరుగుతున్నది. నిర్మల్ జిల్లాతో పాటు కవ్వాల్ టైగర్ రిజర్వ్‌లో దాదాపు రెండు నెలలుగా మరో పులి ట్రాక్ అవుతూ వస్తున్నది. జన్నారం, లక్షెట్టిపేట, మంచిర్యాల, బెల్లంపల్లి రేంజ్‌లతో పాటు ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ రేంజ్ అడవుల్లో ఇది తిరుగుతున్నట్లు ఫారెస్టు అధికారులు చెబుతున్నారు. ఇది బయటి నుంచి వచ్చి ఉండకపోవచ్చని, ఎప్పటి నుంచో మన జిల్లాలోనే ఉంటున్న పులి అని విశ్వసనీయంగా తెలిసింది. సాధారణంగా ఇది పులులు బయటికి వచ్చే సమయం కావడంతో అడవులు మొత్తం సంచరిస్తున్నాయని అధికారులు పేర్కొంటున్నారు. కొంత కాలంగా మంచిర్యాల జిల్లా హాజీపూర్, కాసిపేట మండలాల్లో ఈ పులి సంచరిస్తున్నది. ప్రస్తుతం కొన్ని రోజులుగా ర్యాలీగఢ్‌పూర్ దట్టమైన అడవుల్లో ఈ పులి మకాం వేసింది.

వరుస దాడులు.. భయాందోళనలో ప్రజలు

పులి సంచారంతో అటవీ ప్రాంతాన్ని ఆనుకొని ఉన్న పంట చేలల్లోకి వెళ్లేందుకు రైతులు జంకుతున్నారు. రాత్రి వేళల్లో అటవీ మార్గంలో వెళ్లేందుకు సైతం జంకుతున్నారు. పులి గ్రామ శివారులోకి వచ్చిందని తెలిస్తే చాలు రెండు,మూడు రోజులు బయటికి రావడం లేదు. దీంతో వ్యవసాయ పనులకు, పాడి పశువులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటవీ అధికారులు రైతులకు, జనాలకు ముందస్తు సమాచారం ఇస్తున్నారు. పులి ఈ రోజు ఎక్కడ ఉంది.. ఏ వైపునకు వెళ్తుంద అని నిత్యం ట్రాక్ చేస్తూ.. జనాలను అలర్ట్ చేస్తున్నారు.

పులి పాదముద్రలు

ఇటీవల జరిగిన ఘటనలు

- నిర్మల్ జిల్లా కుంటాల మండలం సూర్యాపూర్ గ్రామానికి చెందిన పశువులపై పులి దాడి చేసింది. ఈ సమయంలో అక్కడే ఉన్న పశువుల కాపరులు కుంటి రాములు, దొంతుల చిన్నయ్య చెట్టుపైకి ఎక్కి ప్రాణాలు కాపాడుకున్నారు.
- కుంటాల మండల అంబుగాం గ్రామ శివారు లో నాలుగు రోజుల క్రితం పులి పాదము ద్రలను అధికారులు గుర్తించారు. వారం క్రితం సూర్యాపూర్, మెదన్‌పూర్, అంబుగాం గ్రామాల సరిహద్దులో సంచరించిన పులి మహారాష్ట్ర సరిహద్దుకు వెళ్లిపోయిందను కున్నారు. కానీ, శుక్రవారం ఉదయం మార్నింగ్ వాక్ కోసం వెళ్లిన కొందరు యువకులకు పులి కనిపించడంతో వెంటనే అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు.
- సారంగాపూర్ మండల పరిధిలోని మహబూబ్ ఘాట్‌లో ఆదివారం రాత్రి కొందరు వాహనదారులకు పులి రోడ్డు దాటుతూ కనిపించిం ది. దీంతో వారు తమ సెల్‌ఫోన్‌లలో పులి ఫొటోలు, వీడియోలను రికార్డ్ చేశారు.
- తాజాగా మంగళవారం పెంబీ మండలంలోని అంకెనా జీపీలోగల బూరుగు పల్లిలో పెద్దపులి దాడి చేయడంతో ఆవు మృతి చెందింది.
- మంచిర్యాల హాజీపూర్ శివారులోని బుగ్గటు సమీపంలోని మామిడి తోటలో గొర్రెల మందపై పులి దాడి చేసింది. ఓ గొర్రె చనిపోయిం ది. మరోగొర్రెను లాక్కెళ్లిపోయింది. ఆ తర్వాత ముల్కల్ల శివారులోని ర్యాలీవాగు ప్రాజెక్టు సమీపంలోని గేదెల మందపై దాడి చేసింది. ఓ గేదె తీవ్రంగా గాయపడ్డది.
- కాసిపేట మండలం గురువాపూర్, పెద్దధర్మారం, చింతగూడ, సల్సాలవాగు ప్రాంతాల్లో పులి సంచరిస్తున్నది. గురువాపూర్ శివారులో మూడు ఆవులపై దాడి చేయగా, అవి మృత్యువాత పడ్డాయి.

ఇది పులులు బయటికి వచ్చే సమయం

సాధారణంగా ఇది పులులు బయటికి వచ్చే సమయం. కవ్వాల్ టైగర్ రిజర్వ్‌లో పులులు తిరగడం అనేది సహజమైన విషయం. కాకపోతే జనవాసాల్లోకి రావడం, పశువులపై దాడి చేయడం వంటి ఘటనల నేపథ్యంలో అటవీ ప్రాంత ప్రజలను అలర్ట్ చేస్తున్నాం. వారికి అవగాహన కల్పిస్తున్నాం. మా ప్రత్యేక టీమ్‌ల ద్వారా పులి సంచరించే సమాచారాన్ని ఎప్పుటికప్పుడు సేకరిస్తున్నాం. పులుల సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నాం.

- శివ్‌ఆశీష్ సింగ్,
జిల్లా అటవీ శాఖ అధికారి, మంచిర్యాల

మాట్లాడుతున్న మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

గ్రూప్-3ని పకడ్బందీగా నిర్వహించాలి

మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, నవంబర్ 12 : జిల్లాలో ఈ నెల 17, 18 తేదీల్లో నిర్వహించనున్న గ్రూప్-3 పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో డీసీపీ భాస్కర్, అదనపు కలెక్టర్ మోతీలాల్, ఆర్డీవో శ్రీనివాసరావు, ఏసీపీ ప్రకాశ్, బెల్లంపల్లి ఏఆర్ ఏసీపీ సుందర్, డీఈవో యాదయ్యతో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 48 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. 17న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు, 18న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12. 30 గంటల వరకు పరీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. అభ్యర్థులు గంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలన్నారు. బయోమెట్రిక్ అటెండెన్స్ ఇవ్వకుండా ఏ ఒక్క అభ్యర్థి పరీక్ష కేంద్రం నుంచి బయటకు వెళ్లరాదన్నారు. డీసీపీ మాట్లాడుతూ పరీక్ష నిర్వహణలో భాగంగా స్ట్రాంగ్ రూమ్ నుంచి పరీక్షా కేంద్రాలకు ప్రశ్నాపత్రాలు, ఓఎంఆర్ షీట్లు, సామగ్రి తరలింపు ప్రక్రియ పోలీసు బందోబస్తు మధ్య జరుగుతుందన్నారు.

కార్గో హోం డెలివరీ సేవలను సద్వినియోగించుకోవాలి

మంచిర్యాలలో అవగాహన ర్యాలీ

మంచిర్యాలటౌన్, నవంబర్ 12 : హైదరాబాద్-సికింద్రాబాద్ నగరాల్లో టీజీ ఎస్‌ఆర్టీసీ కార్గో హోం డెలివరీ సేవలను ప్రవేశపెట్టడం జరిగిందని, వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని మంచిర్యాల కార్గో సెంటర్ నిర్వాహకులు తెలిపారు. ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల కార్గో మేనేజర్ పాల్ ఆదేశాల మేరకు మంగళవారం మంచిర్యాల పట్టణంలో అవగాహన ర్యాలీ తీశారు. జంట నగరాల్లోని 131 ప్రాంతాల్లో కార్గో హోం డెలివరీ సేవలు అందుబాటులో ఉన్నాయని, అతి తక్కువ ధరలతో పార్సిళ్లను ఇంటి వద్దకే చేర్చుతామన్నారు. కిలో బరువులోపు పార్సిల్‌కు రూ. 50, కిలో నుంచి ఐదు కిలోల వరకు పార్సిల్‌కు రూ. 60, ఐదు నుంచి ప్రతీ ఐదు కిలోల బరువుకు రూ. ఐదు చొప్పున అదనంగా పెరుగుతుందని, స్లాబుల ఆధారంగా చార్జీలు వసూలు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఆర్టీసీ డీపో అసిస్టెంట్ మేనేజర్ మాడావి దేవపాల, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లు మహేశ్, రమేశ్, మల్లేశ్, ఇంచార్జి ఎన్ అశోక్‌రావ్, సిబ్బంది, హమాలీ కార్మికులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే మరో పోరాటం

ఆసిఫాబాద్ కలెక్టరేట్ వద్ద దీక్షలో వీవోఏలు

వీవోఏల సంఘం గౌరవాధ్యక్షుడు రాజేందర్

ఆసిఫాబాద్ టౌన్, నవంబర్ 12 : సమస్యలు పరిష్కరించకుంటే మరో పోరాటానికి సిద్ధమవుతామని ఐకేపీ వీవోఏల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు రాజేందర్ అన్నారు. స్థానిక కలెక్టరేట్ ఎదుట వీవోఏల 48 గంటల దీక్ష ముగింపు సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌తో కలిసి డీఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఐకేపీవీవోఏలకు బకాయి ఉన్న స్త్రీ నిధి ఇన్సెంటివ్‌ను వెంటనే గ్రామ సంఘాలకు చెల్లించాలని, గ్రామ సంఘాల నుంచి రావల్సిన రూ.3 వేలు ఇవ్వాలని, ఎన్నికల హామీ మేరకు రూ. 20 వేల జీతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బుద్ధు, రోజా మాట్లాడుతూ వీవోఏలు అనారోగ్యంతో, ప్రమాదాల వల్ల మరణిస్తున్నారని, కనీస బీమా సౌకర్యం లేక వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ త్రివేణి, తెలంగాణ ఐకేపీ ఉద్యోగుల రాష్ట్ర కమిటీ సభ్యురాలు రమా, నాయకులు సంతోష్, రవీందర్, సతీష్, శ్రీనివాస్, ధనరాజ్, తిరుపతి, మహేశ్వరి, సంతోష్, వనిత, ఆనందరావు, మధుకర్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న వీవోఏల ఆందోళన

నస్పూర్, నవంబర్ 12 : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నస్పూర్‌లోని కలెక్టరేట్ ఎదుట వీవోఏలు చేపడుతున్న ఆందోళన మంగళవారం రెండో రోజుకు చేరింది. ఐకేపీ వీవోఏల ఉద్యోగుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు రంజిత్‌కుమార్ మాట్లాడుతూ వీవోఏలకు ప్రభుత్వం రూ. 20 వేల వేతనం ఇవ్వాలని, బకాయి ఉన్న స్త్రీనిధి ఇన్సెంటివ్‌ను వెంటనే గ్రామ సంఘాలకు చెల్లించాలన్నారు. సోషల్ ఆడిట్ రద్దు చేయాలని, అధికారుల వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. లేకుంటే వీవోఏలందరూ ప్రజా భవన్‌ను ముట్టడిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుమార్, రాములు, పోశం, రజిత, అనిత, శారద, మహేశ్, వెంకటి, సమ్మన్న, తుకారాం, రాజ్యలక్ష్మి, భాగ్యలక్ష్మి, సురేష్, రమాదేవి పాల్గొన్నారు.

మంచిర్యాల కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న వీవోఏలు

ఆశ్రమ పాఠశాలలో రెండో రోజూ విచారణ

వాంకిడి, నవంబర్ 12 : మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో జరిగిన ఫుడ్ పాయిజన్ ఘటనపై మొదటి ఆర్డీవో లోకేశ్వర్ రావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సిబ్బందితో పాటు మిషన్ భగీరథ, ఫుడ్ సేఫ్టీ అధికారులను వేర్వేరుగా విచారించి లిఖిత పూర్వకంగా వాంగ్మూలం సేకరించిన విషయం విదితమే. మంగళవారం రెండో రోజు జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ ఆయా శాఖల అధికారులు ఇచ్చిన రిపోర్ట్‌లు, వాంగ్మూలంపై పునఃవిచారిణ జరిపారు. అలాగే తీవ్ర అనారోగ్యానికి గురైన శైలజకు మొదట వైద్యం అందించిన స్థానిక ఆర్ఎంపీతో పాటు రక్త పరీక్షలు చేసిన ప్రైవేట్ ల్యాబ్ టెక్నీషియన్‌లను పిలిపించి విచారించారు. అర్హత లేకున్నా టిస్టులు, వైద్యం ఎలా చేశారని, వారిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో సీతారాంను ఆదేశించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ దవాఖానకు వెళ్లి మొదటి, రెండో రోజు చేర్పించిన విద్యార్థినుల వివరాలు, ఓపీ రికార్డును పరిశీలించారు. డీఎంహెచ్‌వో సీతారాం, మండల ప్రత్యేకాధికారి బిక్కు నాయక్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎంపీవో జావిద్, డాక్టర్లు, ఏఎన్ఎంలు ఉన్నారు.

హెచ్ఎం శ్రీనివాస్‌ను విచారిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్

శైలజ పరిస్థితి విషమం

వాంకిడి,నవంబర్ 12 : మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమోన్నత పాఠశాలలో గత నెల 30న ఫుడ్ పాయిజన్‌తో తీవ్ర అస్వస్థతకు గురై హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతున్న సావాతి జీపీ దాబా గ్రామానికి చెందిన శైలజ ఆరోగ్యం తీవ్ర విషమంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు మంగళవారం రాత్రి తెలిపారు. మంచిర్యాల జిల్లాలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో నాలుగు రోజుల పాటు చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం నిమ్స్‌కు రెఫర్ చేసిన విషయం విదితమే ఆరోగ్యం మెరుగు పడుతున్న క్రమంలో ఒక్కసారిగా విషమించడంతో శైలజను వెంటిలేటర్‌పై ఉంచి మళ్లీ చికిత్స అందిస్తున్నట్లు కుటుంబ సభ్యులు చెప్పారు.

సిర్పూర్(టీ)లో పాదయాత్రకు తరలి వస్తున్న భక్తులు

టోంకిని హనుమాన్ ఆలయంలో అన్నదానంలో పాల్గొన్న భక్తులు

టోంకినికి పోటెత్తిన భక్తజనం

- మహాపాదయాత్రకు 20 వేల మందికి పైగా హాజరు
- కిటకిటలాడిన సిద్ధి హనుమాన్ ఆలయం
- ప్రత్యేక పూజలు నిర్వహించిన ప్రముఖులు
- కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం ఆధ్వర్యంలో భారీ బందోబస్తు

సిర్పూర్(టీ), నవంబర్ 12 : కాగజ్‌నగర్ పట్టణం నుంచి టోంకిని సిద్ధి హనుమాన్ ఆలయం వరకు మంగళవారం నిర్వహించిన 23వ మహాపాదయాత్రకు భక్తజనం పోటెత్తింది. మంగళవారం తెల్లవారు జామున 3 గంటల నుంచే ప్రారంభమైన మహాపాదయాత్ర మధ్యాహ్నం వరకు కొనసాగింది. జిల్లాలోని పలు మండలాల నుంచేగాక అనేక గ్రామాల నుంచి 20 వేల మందికిపైగా తరలిరాగా, దారులన్నీ కిక్కిరిశాయి. పాదయాత్రగా వస్తున్న భక్తులకు కొందరు పండ్లు ఫలహారాలతో పాటు ఛాయ్ అందించారు. భక్తులు ఆలయానికి చేరుకొని క్యూ కట్టి అంజన్నను దర్శించుకున్నారు. దేవస్థానం పరిసరాలు కిటకిటలాడాయి. సిర్పూర్(టీ) జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి అజయ్ ఉల్లం, సిర్పూర్(టీ) ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు వేర్వేరుగా పూజలు చేశారు. సిర్పూర్(టీ) నియోజకవర్గ పరిధిలోని అధికారులు, రాజకీయ నాయకులు స్వామి వారికి మొక్కులు తీర్చుకున్నారు.

భక్తులకు అన్నదానం

టోంకిని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. మండలకేంద్రంలోని బస్టాండ్ చౌరస్తాలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో నాయకులు బాదం పాలు అందించారు. డౌనల్ ప్రాంతంలో ఎమ్మెల్యే హరీశ్‌బాబు ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు జ్యూస్‌లు, కాంగ్రెస్ నాయకుడు రావి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాయకులు, స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ నాయకులు పండ్లు, మజ్జిగ, పాలు, చాయ్ అందించారు.

భారీగా పోలీసు బందోబస్తు

కాగజ్‌నగర్ పట్టణం నుంచి మహాపాదయాత్రగా వస్తున్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. టోంకిని ఆలయాన్ని డీఎస్పీ సందర్శించారు. కౌటల సీఐ రమేశ్ , సిర్పూర్(టీ) సీఐ కమలాకర్, ఎస్ఐలు మధుకర్, విక్రమ్ బందోబస్తులో పాల్గొన్నారు.

టోంకిని ఆలయంలో అంజన్నను దర్శించుకుంటున్న సిర్పూర్(టీ) జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి అజయ్ ఉల్లం

కాగజ్‌నగర్ నుంచి పాదయాత్రగా వస్తున్న భక్తులకు బాదం పాలు అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు